TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 87 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.22.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## జనజీవనస్రవంతిలో కలవండి




అమృత్ తెలంగాణ: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి తాము సాధించాలనుకున్న పనులను ప్రజాస్వామ్య యుతంగా సాధించుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోషామహల్ పోలీస్‌స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ (బ్లాక్ డే) సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టులు అనుసరిస్తున్న మార్గానికి భవిష్యత్ లేదనీ, ఇప్పటికే అగ్రనేతలు కొందరు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు. మిగతావారు కూడా ఆ బాటలో నడిచి ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో తమ భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 191 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరుల య్యారనీ, రాష్ట్రానికి చెందిన ఎస్సై బానోత్ జవహర్‌తో పాటు కానిస్టేబుళ్లు సందీప్, శ్రీధర్, పవన్‌కళ్యాణ్, సైదులు, ప్రమోద్‌లు అమరుల య్యారనీ, వారి త్యాగాలు ఎనలేనివని ఆయన కొనియాడారు. వారికి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో మరణించిన కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు కోటి రూపాయలు, ఎస్సై నుంచి సీఐ వరకు రూ.1.20 కోట్లు, డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ వరకు రూ.1.50 కోట్లు, ఎస్పీ నుంచి ఆ పైస్థాయి వరకు రూ.2 కోట్లను నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తున్నదనీ, అలాగే వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, 300 గజాల స్థలాన్ని కూడా ఇవ్వడం జరుగుతున్నదని వివరించారు.

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు కృషి చేస్తున్న పోలీసుల సంక్షేమం పట్ల ప్రభుత్వం అన్ని విధాలా చేయూత నిస్తుందన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా మొదలుకొని మత కలహాలను అదుపు చేయడంలో పోలీసులు రేయింబవళ్లు కృషి చేస్తున్నారనీ, వారు అందిస్తున్న సేవలకు ప్రజలు కూడా తగిన గుర్తింపును ఇవ్వాలని కోరారు. 2009లో ఆంధ్రప్రదేశ్‌లోని బలిమెల రిజర్వా యర్‌లో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన 32 మంది పోలీసులకు కూడా తమ ప్రభుత్వం గాజులరామారంలో ఒక్కొక్కరికి 200 గజాల భూమిని కేటాయిస్తు తాజాగా నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. వారికి నష్టపరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. పెరిగిపో తున్న సైబర్ నేరాలను అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ మాఫి యాను కట్టడి చేయడానికి ఈగల్ ఫోర్స్ సైతం చేస్తున్న కృషి కూడా ఫలిస్తున్నదని రేవంత్‌రెడ్డి మెచ్చుకున్నారు. చట్టాలను గౌరవించేవారి పట్ల ఫ్రెండ్లీగా, అతిక్రమించేవారి పట్ల కఠినంగా పోలీసులు వ్యవహరిస్తారనే సందేశాన్ని పోలీసులు సమాజంలోకి పంపిం చాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడానికి శాంతి భద్రతలే ప్రధాన కారణమనీ, దాని పరిరక్ష ణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సీఎం చెప్పారు. దేశంలోనే శాంతి భద్రతల పరిరక్ష ణలో రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో ఉండటం గర్వకారణ మన్నారు. పోలీస్ శాఖలో మహిళలను ప్రోత్స హిస్తూ మహిళా ఐపీఎస్ అధికారులు పలువురికి కీలకమైన బాధ్యతలను అప్పగించడం జరిగిందనీ, మూడు ప్రధాన పోలీస్ కమిషనరేట్లలో ఏడుగురు మహిళా ఐపీఎస్ అధికారులు డీసీపీ బాధ్యతలను నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖను మరింత పటిష్టం చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

**లొంగిపోవడమే మార్గం : డీజీపీ శివధర్‌రెడ్డి**

రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర పోలీస్ శాఖ మరింత స్ఫూర్తిదాయకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో కత్తిపోట్లకు గురై మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే ప్రఖ్యాతి గడించిన రాష్ట్ర పోలీస్ శాఖ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మరింత ఇనుమడించిన శక్తితో పని చేస్తున్నదని ఆయన తెలిపారు. మావోయిస్టులకు రాష్ట్రంలో తమ కార్యాలాపాలను కొనసాగించే పరిస్థితులు లేవనీ, లొంగిపోవడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

**'పోలీస్ అమరులు వీరు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం**

అనంతరం 'పోలీస్ అమరులు వీరు' అనే పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తర్వాత ఆ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ (హోం) సి.వి ఆనంద్, డీజీపీ శివధర్‌రెడ్డి, పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మాజీ డీజీపీలు కూడా అమరవీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అదే ప్రాంగణంలో ఈ ఏడాది విధి నిర్వహణలో మరణించిన రాష్ట్రానికి చెందిన ఆరుగురు పోలీసుల కుటుంబ సభ్యులను ఎస్ఐబీ డీజీ సుమతి ముఖ్యమంత్రికి పరిచయం చేయగా వారిని ఆయన పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## వచ్చే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది: కేటీఆర్



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: హైదరాబాద్ లోని సున్నం చెరువు ప్రాంతాన్ని కేటీఆర్ పరిశీలించారు. హైడ్రా బాధితులతో కలిసి సున్నం చెరువు ప్రాంతానికి వెళ్లారు. కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాసులతో మాట్లాడి ప్లాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. హైడ్రా బాధితులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం గూడు లేకుండా చేసింది. ఎన్నో ఏళ్లుగా ఉంటున్న వారిని దౌర్జన్యంగా వెళ్లగొట్టింది. హైదరాబాద్‌లో హైడ్రా వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది. ఇంకో రెండేళ్లలో తెలంగాణ మళ్లీ వెలుగులు చూడొచ్చు" అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపుర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## హెచ్1బీ వీసా..లక్ష డాల్లర ఫీజు వాళ్లకే




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: హెచ్1బీ వీసాలో అమెరికా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదివరకు లక్ష అమెరికా డాలర్లు ఫీజును ఖరారు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించిన విషయం తెలసిందే. తాజాగా హెచ్1బీ వీసా మంజూరులో కాస్తా మినహాయింపు ఇచ్చారు. ఇప్పటికే అమెరికాలో చదువుకుంటూ హెచ్1బీ వీసా దరఖాస్తు చేసుకునే వారు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే బయటి దేశాల్లో చదువుకుని అమెరికాలో ఉద్యోగం కోసం హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకునే వారు మాత్రం లక్ష డాలర్లు ఫీజు కట్టాల్సిందేనని అమెరికా ఇమిగ్రేషన్ సర్వీస్ తెలిపింది.

సెప్టెంబర్ 21న వీసా ఫీజు వెలువడే నాటికే అమెరికాలో ఉన్న వారు ఈ కొత్త ఫీజు కట్టనక్కర్లేదు ). సెప్టెంబర్ 21 తర్వాత వచ్చిన దరఖాస్తులకు మాత్రమే లక్ష డాలర్ల ఫీజు వర్తిస్తుంది. ఈ ఫీజు చెల్లింపుల కోసం ఇప్పటికే ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్టు అమెరికా ఇమిగ్రేషన్ సర్వీస్ తెలిపింది.

## ఢిల్లీని కమ్మేసింది




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం కమ్మేసింది. వారం రోజులుగా ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం కొనసాగుతోంది. దీపావళి వేడుకల తర్వాత అది మరింత ప్రమాదకర స్థాయికి చేరింది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) 451 పాయింట్లతో నమోదైంది. ఎన్సీఆర్ పరిధిలో మొత్తం 38 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లు ఉండగా దాదాపు 36 పాయింట్లలో వెరీ పూర్ కేటగిరితో రెడ్‌జోన్‌ను చూపించాయి. వజీర్‌పూర్ 423, ద్వారకా 417, అశోక్‌విహార్ 404, ఆనంద్ విహార్‌లో 404 ఏక్యూఐ నమోదైంది. అలాగే పటేల్‌నగర్, జహంగీర్‌పురి, బురారి వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 480 దాటినట్టు వెల్లడైంది. ఇది దేశ సగటు కంటే దాదాపు 1.8 రెట్లు ఎక్కువని అధికారులు తెలిపారు. అలాగే యునెస్కో, డబ్ల్యూహెచ్ఓ రికార్డుల ప్రకారం ఏకంగా 15 రెట్లు ఎక్కువని నిపుణులు తెలిపారు. అయితే ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీబీసీబీ) పేర్కొంది. బుధవారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల అత్యవ సర పరిస్థితుల్లోనే ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. కాలుష్యం పెరగడంలో కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద సమస్యలు తలెత్తే అవకాశముందని, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**గతేడాదితో పోల్చితే పెరిగిన కాలుష్యం**

గతేడాది దీపావళి మరుసటి రోజు ఉదయం ఏక్యూఐ 296 పాయింట్లుగా నమోదు కాగా.. ఈసారి దీపావళి పండుగ రోజు సాయంత్రానికే ఎయిర్ క్వాలిటీ దారుణంగా పడిపోయింది. ఇందుకు బాణాసంచా కాల్చడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్సీఆర్ పరిధిలో బాణాసంచా కాల్చడంపై ఇటీవల సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయితే%ి% కొత్తగా ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్ విజ్ఞప్తితో ఈసారి గ్రీన్ క్రాకర్స్ కాల్చుకునేందుకు అక్టోబర్ 15న సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతిని ఇచ్చింది. అయితే ఈ గ్రీన్ క్రాకర్స్ పేరుతో మార్కెట్లో ఎక్స్‌పయర్స్ డేట్, నాణ్యత లేని బాణాసంచా అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయి. ఫలితంగా బాణాసంచా సౌండ్స్ కన్నా పొల్యూషన్ భారీగా పెరిగింది. అలాగే ఢిల్లీవాసులు సైతం భారీగా బాణాసంచాను కొనుగోలు చేశారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకే టపా సులు కాల్చుకునేందుకు కోర్టు అనుమతివ్వగా%ి% అర్ధరాత్రి వరకు బాణాసంచా కాల్చారు. దీనికి వాతావరణ మార్పులు తోడవడంతో కాలుష్య కారకాలు అలాగే అంటి పెట్టుకొని గాలి తేమతో కలిసిపోయాయి.

**ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్**

ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రీసెర్చ్ ప్రకారం%ి% ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ)లో స్థానిక ప్రాంతంలోని గాలి నాణ్యతలను తెలుసుకోవచ్చు. ఏక్యూఐ 0–100 శాతం మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి కాలుష్యం లేదని అర్థం. అదే 100 – 200 శాతం ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని, ఇక 200–300 శాతం మధ్య ఉంటే అధ్వానంగా ఉందని, 300 –400 ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వానంగా ఉన్నట్టు. ఇక 400–500 శాతం మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు లెక్క.ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పెరిగిన కాలుష్యంతో సర్కార్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

## రియాజ్ ఎన్‌కౌంటర్




నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/కంఠేశ్వర్ అమృత్ తెలంగాణ: నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు.. సోమవారం ఉదయం ఏఆర్ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కొని ఫైర్ చేసేందుకు యత్నించగా.. పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా కాల్పులు జరపడంతో రియాజ్ మృతిచెందాడు. ఈ ఘటనపై సీపీ సాయిచైతన్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆసిఫ్ అనే వ్యక్తి నిందితుడు రియాజ్‌ను పట్టించాడు. ఈ సమయంలో ఇద్దరూ గాయపడటంతో.. ఆసిఫ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. రియాజ్‌ను నిజామాబాద్ జీజీహెచ్‌లో ఖైదీ వార్డుకు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో రియాజ్ ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశాడు. రెగ్యూలర్ తనిఖీలలో భాగంగా అటుగా వచ్చిన ఏఆర్ పోలీసులు అతన్ని వారించారు. అదే సమయంలో ఏఆర్ కానిస్టేబుల్ నుంచి తుపాకీ లాక్కున్నాడు. దాన్ని ఇవ్వాలని చెబుతున్నా వినకుండా ట్రిగ్గర్ నొక్కి కాల్చేందుకు ప్రయత్నిస్తుండగా.. తప్పనిసరి పరిస్థితుల్లో ఆత్మరక్షణలో భాగంగా ఏఆర్ ఎస్ఐ కాల్పులు జరిపారు. దాంతో కింద పడిపోయిన రియాజ్ లేవకపోవడంతో వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. దీనికి సంబంధించి కేసు విచారణలో ఉంది.

**తెల్లవారుజామున రియాజ్ అంత్యక్రియలు**

రియాజ్ మృతదేహానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం తెల్లవారుజామున అంత్యక్రియలు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: జపాన్ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ప్రధానిగా సనే తకైచి ఎన్నికయ్యారు. ఈమె ఆ దేశానికి తొలి మహిళా కావడం విశేషం. పార్లమెంటులోని దిగువ సభ 465 ఓట్లలో తకైచి 237 ఓట్లను గెలుచుకున్నారు. దిగువ సభలో జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్‌లో కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు యోషిహికో నోడాకు 149 ఓట్లు రాగా, ఎల్‌డిపి పార్టీ అభ్యర్థి తకైచి 237 ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె ప్రధాని మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జపాన్ న్యూస్ ఏజెన్సీ క్యోడో తెలిపింది. కాగా, ప్రధానిగా తకైచి ముందు అనేక సవాళ్లున్నాయి. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, అవినీతి కుంభకోణాలు, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు%ి% ఇన్ని సవాళ్ల మధ్య సనై తకైచి ప్రధాని బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : జిల్లా కలెక్టర్

## విధి నిర్వహణలో అసువులు బాసిన ప్రతి పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి . జిల్లా ఎస్పీ







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం ఏఆర్ హెడ్క్వార్టర్స్ ప్రాంగణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో, దేశ సరిహద్దుల రక్షణలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర్ రావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ గోడం నాగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమరవీరుల ముఖ చిత్రాలతో ఏర్పాటు చేసిన ఈ స్తూపం ప్రత్యేక గుర్తింపు పొందింది. కార్యక్రమం ప్రారంభంలో ఉన్నతాధికారులు స్తూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు శస్త్రసల్యూట్తో అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. శోక శస్త్ర ద్వారా సలామి ఇచ్చి, రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తమ కుటుంబాలను పక్కన పెట్టి ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించడం పోలీసులు మాత్రమే చేయగలరని తెలిపారు. వారి సేవలు నిస్వార్థమైనవి, త్యాగపూరితమైనవని అన్నారు. ప్రతి ఒక్కరు పోలీసు వ్యవస్థకు సహకరించి నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలను సమాజంలో గౌరవప్రద స్థానాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, జిల్లా యంత్రాంగం తరఫున ఎలాంటి సహాయ సహకారాలైనా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడక్ సమీపంలోని హాట్ స్ప్రింగ్ ప్రాంతంలో చైనీయుల దాడిలో పదిమంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందారని, ఆ సంఘటనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన 191 మంది పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గతంలో నక్సలైట్ వ్యతిరేక పోరాటంలో 50 మంది పోలీసు సిబ్బంది త్యాగాలు చేశారని, వారి స్ఫూర్తితో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల భద్రత కోసం ముందుకు సాగుతోందని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ఎలాంటి అవసరాలైనా పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, వారి త్యాగం దేశానికి శాశ్వత గౌరవం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బి. సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, కమతం ఇంద్రవర్ధన్, డీఎంహెచ్వో నరేంద్ర రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, ఆర్టీసీ ఆర్ఎం, రెండవ బెటాలియన్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల, బాలికలు-2లో ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం బంగారు గూడలోని టీజీఎంఆర్ఎస్ జూనియర్ కాలేజ్ (బాలికలు)–2లో ఎక్సలెన్స్ సెంటర్ (Centre of Excellence - COE) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వృద్ధి, అభివృద్ధికి ప్రతీకగా రూపొందించిన చార్టును కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఐఐటి, నీట్, ఇతర జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తును ముందస్తుగా పరిగణనలోకి తీసుకొని టిజిఎంఆర్ఎస్ మెరుగైన అభ్యాసం, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాలను అమలు చేస్తుందని కలెక్టర్ వివరించారు. అంతకుముందు కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా కేప్టెన్ సలీమ్ ఉద్దీన్ లక్ష్యాలు, విజన్, విద్యార్థుల విద్యాసంబంధిత ప్రతిభను, అభివృద్ధిని ప్రోత్సహించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్ కరీం అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ జి. పల్లవి, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి "పాలన పథకం" కీలకం: జిల్లా కలెక్టర్ రాజార్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బలరాక్షక్ భవన్‌లో మంగళవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "పాలన పథకం"పై ఐసీడీఎస్ సిబ్బందికి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలన పథకం లక్ష్యాలు, అమలు విధానం, డేటా సేకరణ పద్ధతులు, మొబైల్ అప్లికేషన్ వినియోగం తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర లీడ్ రాజారామ్ ప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి మాణికప్ప ప్రధాన శిక్షణదారులుగా పాల్గొన్నారు. అనంతరం వారు రిక్షా కాలనీ, సంజయ్ నగర్, మహాలక్ష్మి వాడ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, కేంద్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం అధికారులు జిల్లా కలెక్టర్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి, పూల మొక్కను అందజేశారు. పాలన పథకం అమలు పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాలన పథకం అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని, పిల్లలు, గర్భిణీలకు శారీరక, మానసిక అభివృద్ధికి సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సమగ్రంగా పనిచేస్తే గ్రామస్థాయిలో సానుకూల మార్పులు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, సీడీపీఓలు సౌందర్య, శారద, ఉమాదేవి, నర్సమ్మ, వినూత్న, డీఎంసీ యశోద, సూపర్వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ - 2047 "సిటిజన్ సర్వే లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి: ప్రజలకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపు.



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వే లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారని పేర్కొన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వేను చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుందని తెలిపారు. www.telangana.gov.in /telanganarising అనే వెబ్ సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను పొందుపరచాలని అన్నారు. శక్తివంతమైన తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ధాన్యం కొనుగోళ్లు పగడ్బందీగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కోత ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం కోసం వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగా పరిశీలించాలని, ప్రతి వేయింగ్ మిషన్‌కి తప్పనిసరిగా స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసి రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. టార్పలిన్‌లు, గన్ని సంచులు సరిపడా అందుబాటులో ఉంచాలని, లారీలు, కూలీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ చేయడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అవసరమైతే కంట్రోల్ రూమ్ నంబర్ 9182958858ను సంప్రదించవచ్చని తెలిపారు కొనుగోలు ఏజెన్సీల సిబ్బందికి తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, హార్వెస్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. రోజువారీగా వరి ధాన్యం కొనుగోలు వివరాలను తమకు అందజేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ సుధాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మొన్న భార్య గంగోత్రి, నేడు భర్త సంతోష్

## ప్రేమ వివాహం చేసుకున్న ఇరవై ఐదు రోజుల్లో ఇద్దరు ఆత్మహత్య



గంగోత్రి, సంతోష్ (ఫైల్ ఫోటో)

ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి శివారులోని ఒడ్డెర కాలనీకి చెందిన బోదాసు గంగోత్రి (22), అదే కాలనీకి చెందిన అలేపు సంతోష్ ప్రేమించుకున్నారు. వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్న ఇద్దరు రెండు కుటుంబాల పెద్దలను ఒప్పించారు. దీంతో గత నెల 26న పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. అయితే, దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 2న గంగోత్రి భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. అదే రోజు భోజనం చేస్తున్న సమయంలో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఇరువురికి తల్లిదండ్రులు సర్ది చెప్పడంతో సంతోశ్ తన భార్యతో కలిసి తమ ఇంటికి వెళ్లిపోయారు అయితే, అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత గంగోత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న గంగోత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఇది గడిచి పద్దెనిమిది రోజులు అవుతుంది, ఇద్దరు ఎంతో ఇష్టంతో ప్రేమ వివాహం చేసుకుని భార్య గంగోత్రి అలా కావడంతో ఏమైనా చేసుకునే పరిస్తితి లేకపోలేదు అన్న భయంతో జాగ్రత్త పడి సంతోష్ ను ఆదిలాబాద్ జిల్లాలోని వాళ్ళ అక్క ఇంటి వద్ద కు తమతో పాటు తీసుకెళ్లి చూసుకుంటున్న క్రమంలో సంతోష్ అక్క వాళ్ళ ఊరిలోనే మంగళవారం మధ్యాహ్నం సుమారు 2:00 ల ప్రాంతంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వారం క్రితం భార్య గంగోత్రి కేసు విషయంలో ఎంక్వయిరీ నిమిత్తం మెట్ పల్లి పోలీసుల వద్దకు వచ్చాడని సమాచారం ఏది ఏమైనా చిన్న వయసులో ప్రేమ వివాహం చేసుకుని పది కాలాలు పిల్ల పాపలతో బ్రతికే రెండు నిండు ప్రాణాలు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల బలి ఐపోయాయి .రెండు కుటుంబాలకు తీరని లోటు చేసి వెళ్ళి పోయారని పలువురు మాట్లాడుకుంటున్నారు.

# జగ్గసాగర్ కొండ్రికర్ల బీట్ రోడ్డుకు నిధులు మంజూరు

## కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు:జువ్వాడి కృష్ణారావు



మెట్ పల్లి రూరల్ అక్టోబర్ 21 జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం జగ్గసాగర్, కొండ్రికర్ల గ్రామాలలో మంగళవారం బీట్ రోడ్ నిర్మాణానికి రూ.70 లక్షల సీఆర్ఆర్ నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డితో కలిసి జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పల్లె రోడ్డును అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత గత బీఆర్ఎస్ నాయకులకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఘాటుగా విమర్శించారు.

# మంత్రి అడ్లూరి తొలి సంతకం జగన్నాథ్ పూర్ బ్రిడ్జి మంజూరు పైనే..! మాజీ మంత్రి జీవన్ రెడ్డి







రాయికల్ అమృత్ తెలంగాణ అక్టోబర్ 21 జగన్నాథపూర్,బోర్నపల్లి వంతెన నిర్మాణం గిరిజనుల దశాబ్ద కలని మంత్రి అడ్లూరి దృష్టికి తీసుకెళ్లగా అల్లూరి మంత్రిగా బాధ్యతలు చేపట్టి జగన్నాథ్ పూర్, బోర్నపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి మంజూరు పైనే తొలి సంతకం చేశారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం రాయికల్ మండలంలోని జగన్నాథ్ పూర్ గిరిజన గ్రామంలో దీపావళి వేడుకల్లో భాగంగా దండారి నృత్యాలకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి,ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. ఆదివాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పూజోత్సవం,డప్పుల దరువు, గజ్జెల మోత, గుస్సాడీలు వేసే స్టెప్పులు,ఒకవైపు కోలాట నృత్యాలు,మరోవైపు గోండి పాటల నృత్యం,హాస్యనాటికల ప్రదర్శనలతో అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇంటి నిర్మాణం చేపట్టేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీలకు పట్టాలు ఇప్పించేందుకు తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించిన నాయకుడు కొమురం భీముని అని ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని బోర్నపల్లి వంతెన నిర్మాణం చేపట్టాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకురాగా మంజూరు చేశారని బోర్నపల్లి,కమ్మునూరు బ్రిడ్జిల నిర్మాణం దగ్గరుండి పర్యవేక్షించానని పేర్కొన్నారు. రాయికల్ మండలం జగన్నాథపూర్,బోర్నపల్లి గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రి అడ్లూరికి వినతి పత్రం అందించగా బ్రిడ్జ్,రహదారి నిర్మాణానికి 17.50 కోట్ల నిధులు మంజూరుకు జీ ఓ 207 ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 8 సంవత్సరాల క్రితం బ్రిడ్జ్ నిర్మిస్తానని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం అన్నారు.

# ప్రమాదాలకు నెలవైన రోడ్లు : అసంపూర్తిగా వదిలిపెట్టిన పల్లె దవాఖానా కట్టడాలు.

## పేరుకు పెద్దగ్రామం వసతులు అద్వాన్నం మొగిలిపేట ప్రత్యేకం





**మల్లాపూర్ అమృత్ తెలంగాణ అక్టోబర్ 21**

మల్లాపూర్ మండలం లోని మేజర్ గ్రామమైన మొగిలిపేట పరిస్థితి ఇదీ...అన్ని గ్రామాలతో పోలిస్తే అన్ని ఎక్కువే ఇక్కడ , ప్రభుత్వానికి పన్నులు కట్టడంలో ఎక్కువే,మద్యం కొనుగోళ్ల ద్వారా పన్నుల రూపంలో ప్రభుత్వానికి లాభం చేకూర్చడంలోఎక్కువే,స్కూల్లో పిల్లలు ఆటపాటల్లో ఒకింత ఎక్కువే,గ్రామదేవతలు ఎక్కువే గ్రామదేవతలకు పండగలు చేయడంలో ఎక్కువే, పండగలుచేసే విడిసి వారు ఎక్కువే (అన్ని గ్రామాలతో పోలిస్తే) , షాపులు ఎక్కువే హొటళ్ళు ఎక్కువే, గోదావరి ఎక్కువే వచ్చే భక్తులు ఎక్కువే, ఆచారాలు ఎక్కువే "గ్రహ"చారాలు ఎక్కువే,వ్యవసాయాలు ఎక్కువే వ్యవహారాలు ఎక్కువే,నాయకులు ఎక్కువే పార్టీలు ఎక్కువే, రోడ్లు ఎక్కువే రోడ్ల మీద గుంతలు ఎక్కువే ,ఆ గుంతల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలుకూడ ఎక్కువే కానీ గుంతలు పూడ్చే ప్రయత్నం, సమర్థత మాత్రం చాలా తక్కువ. మెట్ పల్లి నుండి ఖానాపూర్ పోయే బస్సులు నడిచే ప్రధాన రహదారైన రోడ్డు మొగిలిపేట ఆరంభం నుండి, ముగింపు వరకు గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. రోడ్డుకు ఏ ఒక్క ప్రక్కన కూడా గటేరు నిర్మించలేకపోవడం గత నాయకుల పనితనానికి నిదర్శనమైతే, ఏడాదిన్నర క్రితం మరమ్మతులు చేసిన దానిలో నాణ్యత లేకపోవడంతో ఏడాది లోపే మునుపటి దానికన్న హీనంగా తయారై నడిచే పరిస్థితే లేకుండా పోయింది ఆటోలు బోల్తా పడ్డా, బస్సులు నాట్యం చేస్తున్న ,పట్టించుకునే నాయకులే లేరని గ్రామస్తులు భావిస్తున్నారు కొందరు యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చేసిన అది సరి పోవడం లేదు.అధికారులు నాయకులు స్పందించి మా ఊరి రోడ్డు బాగుచేయించాలని ప్రజలు కోరుకుంటున్నారు

ఇదిలాఉంటే

పోనీ అక్కడ రోడ్డు మీద పడ్డ వారిని కనీసం ప్రథమ చికిత్స కోసం పంపుదామంటే ఇక్కడ పల్లె దవాఖానా పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ప్రస్తుత సంవత్సరం వర్షాలు ఎక్కువ కురిసిన కారణంగా,మురికికాల్వలు సకాలంలో తీయనందున అంటూ రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంతాల నిరుపేద ప్రజలకు , ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్న ఒక సదుద్దేశంతో పల్లె దవాఖానా లు ఏర్పాటు చేయాలనుకున్నప్పటికి అది పూర్తికావడంలేదు. అట్టహాసంగా ప్రారంభించిన పనులు ఆదిలోనే ఆగిపోవడం బాధాకరమని ప్రజలు భావిస్తున్నారు. నిధులు రాకనో ,లేక చేయాలని లేకనో తెలియదు గానీ మనుషుల కొరకు కట్టుకున్న పల్లె దవాఖానా లు సంపూర్ణంగా పూర్తి చేయలేక ఇప్పుడు కుక్కలకు పందులకు ఉపయోగ పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పనులు ఎందుకు జరగడం లేదో తెలియక,ఎవరినిఅడగాలో తెలియ క , ఆ పనితో సంబంధం లేని వ్యక్తిని ,అర్హత లేని వ్యక్తిని అడగడం వలన కోప్పడుతూ, చికాకు పడుతూ సమాదానం చెప్తున్నారని, నాడు డాక్టర్లు ప్రతి రోగానికి ఇచ్చే ఒకే మందు బిళ్ళ పారాసెటమాల్ లాగ ,ప్రతీ సమస్యకి కార్యదర్శి దగ్గరకు వెళ్లడంతో ఆ సమస్య సరైన రీతిలో,సరైన సమయంలో పరిష్కారం కావడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఆఆ.. పేపర్ వాళ్ళదేముంది రాస్తారు వదిలేస్తారు అనుకుంటున్నారేమో కానీ మేము చూస్తున్నాం ఖచ్చితంగా సమయం వచ్చినప్పుడు మా ఓటు ద్వారా బుద్ధి చెబుతామని ప్రజలు అనుకుంటున్నారు.. ఇప్పటికైనా ప్రభుత్వం,సంబంధిత అధికారులు,కాంట్రాక్టర్ లు నాయకులు స్పందించి ఈ సమస్యలు త్వరిత గతిన పరిష్క రించాలని ప్రజలు కోరుకుంటున్నారు

# మహిళ హత్య కేసులో ప్రధాన నిందుతుడు అరెస్ట్




రాజన్న సిరిసిల్ల : అమృత్ తెలంగాణ: సిరిసిల్లలోని అశోక్ నగర్ లో గత సంవత్సరం మహిళను హత్య చేసిన నిందితుడిని మంగళవారం సిరిసిల్ల సిఐ కృష్ణ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. సీఐ కృష్ణ కథనం ప్రకారంబీహార్ రాష్ట్రానికి చెందిన రూడల్ సదా,రామ్బిక్స్ సదా అనే ఇద్దరు కూలీలు కూలీ పని కోసం సిరిసిల్లకు వచ్చి అశోక్ నగర్ లో రామస్వామి అనే వ్యక్తి ఇంట్లో రూమ్ కిరాయికి తీసుకొని కూలీ పని చేసుకుంటూ జీవిస్తూన్నారు. అందులో కూలి పని చేస్తున్న దగ్గర కోడిముంజకు చెందిన అలకుంట రమ అనే మహిళతో పరిచయం పెంచుకొని ఆమెని అనుభవించాలనే ఉద్దేశ్యంతో 19 మార్చి 2024 న కూలి పని అయిన తర్వాత ఆమెను రూమ్ కి తీసుకు పోయి ముగ్గురు కలిసి వారు తెచ్చుకున్న మద్యం సేవించిన అనంతరం నిందుతులు ఇద్దరు కలిసి రమను ఒకరి తరువాత ఒకరు అనుభవించాలనుకొగా ఆమెకు మత్తు వదలగా, ఎవరికైనా విషయం చెప్పుతాదనే అనుమానముతో రమను హత్య చేయగా ఈహత్య పై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా రామ్బిక్స్ సదా ని గత సంవత్సరం అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని, అప్పటి నుండి తప్పించుకోని ఫోన్ నంబర్స్ మార్చుతూ వివిధ రాష్ట్రాల్లో మకాం మారుస్తూ వస్తున్న రుడల్ సదా అనే నిందుతుణ్ణి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్ లో అల్వాల్ లో ఉ ంటున్నడని తెలుసుకొని మంగళవారం రుడల్ సదా అనే నిందుతుణ్ణి అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించడం జరిగిందని పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ వివరించారు.

# అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన యువకుడు



మల్లాపూర్ అమృత్ తెలంగాణ అక్టోబర్21 మండల కేంద్రమైన మల్లాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు వెంకటరెడ్డి అనే యువకుడు తమ గ్రామంలో వసతులు, సౌకర్యాలు గత కొద్ది కాలంగా పరిష్కారం కాకపోవడంతో అతను వినూత్నంగా అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం రోజున వినతి పత్రాన్ని అందజేశారు . ఆ వినతి పత్రంలో గ్రామ శ్మశాన వాటికలో నీటి సౌకర్యం లేక దహన సంస్కారాలనంతరం స్నానం చేయకుండా గ్రామస్తులందరు ముట్టుడు తోనే ఇండ్లకు చేరుకొని స్నానం చేస్తున్నామని, మల్లాపూర్ మోడల్ స్కూల్ కు వాళ్ళే దారిలో వంతెన నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చిన నాయకులు ఇంత వరకు జరిపించలేదని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు బస్ షెల్టర్ ల నిర్మాణం కావాలని , అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రతి సంవత్సరం వర్షపు నీరు నిలిచి ఇళ్లలోకి వస్తున్నాయని అక్కడ వెడల్పైన మురికి కాల్వలు నిర్మించాలని ,పాత బస్టాండ్ లో మరుగుదొడ్లు నిర్మించాలని మరియు ఇతర సమస్యలపై అధికారులు నాయకులు ఎన్నిసార్లు విన్నవించిన స్పందన కరువైందని అందుకే అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్నానని పేర్కొన్నారు

# దండారి ఉత్సవాల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ప్రభుత్వం దండారి చెక్కు ఇవ్వడంలో ఆలస్యం చేసినా నేను 10 వేలు అందిస్తున్నా**
**దండారిల కొరకు ప్రత్యేక పథకం పెట్టి 10 వేలు అందించింది కేసీఆర్ ప్రభుత్వం**
**ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘన స్వాగతం బందంరేగడి పలికిన గుస్సాడీలు**





అమృత్ తెలంగాణ నెరడిగొండ మండలంలోని బందంరేగడి గ్రామంలో దండారి ఉత్సవాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని గుస్సాడీలు, మహిళలు మంగళహారతులతో, సాంప్రదాయపు నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దండారి నృత్యాలు వీక్షించిన అనంతరం మాట్లాడారు. ఆదివాసులు ఎంతో గొప్పగా జరుపుకునే దండారి పండుగకు సహాయం అందించాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆలోచించి దండారి చెక్కులు ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గులాబ్, నానక్ సింగ్, అనిల్ యాదవ్, రమేష్, నజీర్, రాజు తదితరులు పాల్గొన్నారు

## విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమరవీరుల త్యాగనిరతి చిరస్మరణీయం..

## - తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ : శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో పోలీసులది కీలక పాత్ర అని విధినిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసుల సేవలు సమాజం ఎప్పటికీ మరిచిపోదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ను పురస్కరించుకుని నేడు జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలోని పోలీసు అమరవీరుల స్థూపానికి కాంగ్రెస్ నేతలతో కలిసి నివాళులు అర్పించారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ అంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమరవీరుల త్యాగనిరతి చిరస్మరణీయమన్నారు. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో శాంతిభద్రతల పర్యవేక్షణకు ఎలాంటి విఘాతం తలెత్తకుండా ప్రజలకు రక్షణగా నిలిచి పోలీసుశాఖ మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, రెండ్ల రాజన్న, అలీమ్, సమీఉల్లా ఖాన్, రాజు, మమ్మద్, మన్సూర్ ఖాన్, కొరటి ప్రభాకర్, స్క ఫయీమ్, షేక్ రహిమోదిన్, పోచన్న, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తి రిమాండ్




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం టూటౌన్‌లో వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ రషీద్ అలియాస్ రషీద్ ఖాన్ పాత వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. పోలీసులు ఓ వ్యక్తిని కొట్టినట్లు ఉన్న ఈ వీడియో పోస్టు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎవరైన శాంతిభద్రతలు, విద్వేశాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లు ఇలాంటి పోస్టులు పెట్టకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# నిర్మల్ పోలీస్ మీ పోలీస్

## నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించిన మల్టీ జోన్ - ఐజీ శ్రీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి గారు





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేసిన ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మల్టీ జోన్ -I ఐజీ శ్రీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ని,కలిసి జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఐజీ జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమై, అడిషనల్ ఎస్పీలకు, ఏ ఎస్పీ లకు,ఇన్స్పెక్టర్లకు వివిధ అంశాలపై దిశానిర్దేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతలు సమర్ధవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు కృషి చేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు.

# జడ కొప్పు కోలాటం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న తాసిల్దార్ భక్తుల విశ్వంభర్




ముగింపు కార్యక్రమంలో తాసిల్దార్ బత్తుల విశ్వంభర్ ను సన్మానిస్తున్న జందాపూర్ గ్రామస్తులు దృశ్యం




జ్యోతి ప్రజ్వల చేస్తున్న తాసిల్దార్ బత్తుల విశ్వంభర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ గ్రామంలో జడ కొప్పు కొన్ని సంవత్సరాలుగా జరుగుతుంది ఈ కోలాటం ఆడడం వల్ల శరీరం చాలా దృఢంగా అవుతుంది. ఆరోగ్యం బాగుంటుంది శాస్త్రీయ పద్ధతిలో ఊరు బాగుంటుందని గ్రామస్తులు నమ్ముతారు అలాగే గ్రామంలో బర్కత్ ఉంటుందని గ్రామ పెద్దలు చెబుతున్నారు ఈ ఐదు రోజుల కార్యక్రమం ముగిసింది అని గ్రామస్తులు చాలా సంతోషంగా ఉండాలని కళాకారులు దేవతను పూజించారు జందాపూర్ గ్రామం పాడి పంటలతో కళకళ ఉండాలని ఆ దేవతను ఐదులపాటు పూజించారు తాజా మాజీ సర్పంచ్ పసుల గంగాధర్ తెలిపారు ముఖ్య భూమిక పోషించిన ఎల్టి భాస్కర్ రెడ్డి గ్రామం మీద ప్రేమ ఉండాలని పలువురు భాస్కర్ రెడ్డిని అభినందించారు ఎల్టి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామం నాది కళాకారులను తయారు చేస్తా భవిష్యత్తులో ఇంకా ప్రోత్సహిస్తా అని ఎల్టి భాస్కర్ రెడ్డి తెలిపారు తాసిల్దార్ బత్తుల విశ్వంభర్ మాట్లాడుతూ చదువు పట్ల శ్రద్ధ వహించాలని గ్రామస్తులకు యువకులకు విద్యార్థులకు తెలియజేశారు గ్రామంలో ఉన్నటువంటి కళాకారులని అభినందించారు ఇక్కడ కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో ఐదు రోజుల పాటు విజయవంతం అయిందని గ్రామస్తులు తెలిపారు

# జడ కప్పు కోలాటం సందర్భంగా జందాపూర్ గ్రామంలో విగ్రోవర్ ప్రచారం







అదిలాబాద్ గ్రామీణం మండలంలో జందాపూర్ గ్రామంలో విగ్రోవర్ ఆవిష్కరం గ్రామస్తులతో చేశారు ఈ కార్యక్రమంలో ఆర్బిఎం గజానంద్ మరియు మేనేజర్ శ్రీనివాస్ పలువురు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

# రోటిగూడ గల్ఫ్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కు ఘన సన్మానం




జన్నారం :అమృత్ తెలంగాణ: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ పాలజి శ్రీనివాస్ ని, గ్రామంలోని శివశక్తి సామాజిక సంక్షేమ సంస్థ – రోటిగూడ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గత కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో, ముఖ్యంగా అక్కడ మరణించిన కార్మికుల మృతదేహాలను వారి కుటుంబాలకు చేరవేయడంలో, శ్రీనివాస్ కీలక పాత్ర పోషిస్తూ మానవతా సేవలో ముందుంటున్నారు. అలాగే గల్ఫ్‌లో చిక్కుకున్న లేదా ఆపదలో ఉన్న కార్మికులకు సహాయం చేయడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారు. రోటిగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కమిటీ మరియు శివశక్తి సామాజిక సంక్షేమ కమిటీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ, గ్రామ ప్రజల మన్ననలు పొందిన శ్రీనివాస్ ని సన్మానించడం పట్ల సంస్థ సభ్యులు గర్వంగా భావించారు, ఈ సందర్భంగా శివశక్తి సామాజిక సంక్షేమ సంస్థ అడ్మిన్ సేపురి గోపాల్ మాట్లాడుతూ, "పాలజి శ్రీనివాస్ స్వార్థరహితంగా చేస్తున్న సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శం. గల్ఫ్‌లో పనిచేసే మా గ్రామ కార్మికుల సమస్యలను ప్రభుత్వ స్థాయిలో కూడా గుర్తింపుపొందేలా ఆయన కృషి చేస్తున్నారు"

# నాని 'జెండా పై కపిరాజు' హీరోయిన్ పెళ్లి!



నేచురల్ స్టార్ నాని సరసన 'జెండా పై కపిరాజు' అనే చిత్రంలో నటించింది. దక్షిణాదిన నాలుగు ప్రధాన భాషల్లో నటించింది పార్వతి నాయర్. నేచురల్ స్టార్ నాని సరసన 'జెండా పై కపిరాజు' అనే చిత్రంలో నటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో పలు చిత్రాలతో పాపులరైన ఈ బ్యూటీ ఇప్పుడు పెళ్లితో జీవితంలో సెటిలవుతోంది. పార్వతి నాయర్, చెన్నైకి చెందిన వ్యాపారవేత్త అశ్రిత్ అశోక్‌ను వివాహం చేసుకోనుంది. వారి బంధాన్ని ఇరు కుటుంబాలు ఆమోదించాయి. నిశ్చితార్థ వేడుక ఇటీవల చెన్నైలో జరిగింది. మెహందీ , హల్దీ సహా ప్రీవెడ్డింగ్ వేడుకలు ఫిబ్రవరి 6న చెన్నైలో ప్రారంభం కానున్నాయి. పార్వతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో నిశ్చితార్థ ఫోటోలను షేర్ చేయగా ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. ఓ కార్యక్రమంలో కలిసాక మాటలు కలిసాయని ఇప్పుడు ప్రేమలో ఉన్నామని పార్వతి వెల్లడించారు. కొన్ని నెలల పాటు ఈ జంట డేటింగ్ సాగింది. చెన్నైలో మలయాళం, తెలుగు సంప్రదాయాలను అనుసరించి తల్లిదండ్రుల ఆమోదంతో వివాహం చేసుకుంటున్నామని, వివాహానంతర వేడుకలు కేరళలో జరుగుతాయని నాయర్ వెల్లడించారు. అయితే పార్వతి నాయర్ వివాహ తేదీని ఇంకా ప్రకటించలేదు. కమల్ హాసన్ –ఉత్తమ విలన్, గౌతమ్ మీనన్ యెన్నై అరిందాల్ (ఎంతవాడు కానీ- అనుష్క), ఎంగిట్ట మోతాతే, నిమిర్ వంటి చిత్రాలలో తన నటనతో మెప్పించింది. దళపతి విజయ్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ 'ది గోట్'లో కూడా ఒక చిన్న పాత్ర పోషించింది. 2025 ఫిబ్రవరి 7న విడుదల కానున్న 'అలంబన' చిత్రంలో పార్వతి కీలక పాత్ర పోషించారు. పెళ్లి తర్వాత నటిస్తుందా లేదా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# అందాల మీను కవర్ స్టిల్ చూశారా!



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి ఈ ఏడాది మరిన్ని పెద్ద సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి ఈ ఏడాది మరిన్ని పెద్ద సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 2025ను ఆరంభంలోనే బిగ్గెస్ట్ సక్సెస్‌తో ప్రారంభించింది. గత ఏడాది సంక్రాంతికి వచ్చిన 'గుంటూరు కారం' సినిమాలో సెకండ్ హీరోయిన్ పాత్రలో కనిపించడంతో పాటు, ఆ సినిమా పెద్దగా ఆడకపోవడంతో జనాలు ఈ అమ్మడిని పట్టించుకోలేదు. కానీ లక్కీ భాస్కర్‌లో మంచి నటనతో పాటు, ఆ సినిమాకు హిట్ టాక్ దక్కడం వల్ల వరుసగా ఆఫర్లు దక్కాయి. లక్కీ భాస్కర్ సమయంలోనే మట్కా సినిమాతో ఫ్లాప్‌ని చవి చూసింది. టాప్ లిస్ట్ ఇదే! గత ఏడాది 'లక్కీ భాస్కర్' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి, ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సక్సెస్‌ను సొంతం చేసుకుంది. తక్కువ సమయంలోనే రెండు పెద్ద విజయాలను సొంతం చేసుకున్న నేపథ్యంలో టాలీవుడ్‌లో ఈ అమ్మడు మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నవీన్ పొలిశెట్టి హీరోగా రూపొందుతున్న సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ సినిమాకు సంబంధించిన టీజర్ ఇటీవల విడుదల అయ్యింది. అనగనగా ఒక రాజుతో మీనాక్షీ మరో విజయాన్ని తన ఖాతాలో ఇదే ఏడాది వేసుకునే అవకాశాలు ఉన్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సంక్రాంతికి వస్తున్నాంతో ఈ అమ్మడి పారితోషికం అమాంతం పెరిగిందట. సినిమాలతోనే కాకుండా అప్పుడప్పుడు ఇలా అందాల ఆరబోత ఫోటో షూట్స్‌తోనూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజ్‌పై పూజా హెగ్డే కన్నుల విందు చేసింది. స్టైలిష్ గాగుల్స్‌తో విభిన్నమైన ఔట్ ఫిట్‌తో క్లోజప్‌లో ఈ అమ్మడి అందాల ఆరబోత అదిరి పోయింది. ఆకట్టుకునే అందంతో పాటు స్టైల్ ఐకాన్‌గా ఈ కవర్‌పై మీనాక్షి చౌదరి కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బిగ్గెస్ట్ హిట్‌ను దక్కించుకోవడంతో జోరు మీదున్న ఈ అమ్మడికి ముందు ముందు ఇలాంటి స్పెషల్ కవర్ స్టిల్స్ మరిన్ని దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ అమ్మడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాను ఎంజాయ్ చేస్తోంది. గత నెల రోజులుగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే ఉంది. వెంకటేష్, మీనాక్షి చౌదరితో కలిసి తగ్గకుండా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నా సినిమాలో ఎవరి ప్రాముఖ్యత వారికి ఉంది. అందుకే మీనాక్షికి సైతం ఈ సినిమాతో మంచి గుర్తింపు దక్కింది.


ఆకట్టుకునే అందంతో పాటు అలరించే నటన ప్రతిభ ఉన్న ఈ అమ్మడు టాలీవుడ్‌లో ముందు ముందు స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు ఉన్నాయి. మహేష్ బాబుతో లీడ్ పెయిర్ కోసం, ప్రభాస్‌తో నటించడం కోసం వెయిట్ చేస్తున్నట్లుగా ఈ అమ్మడు ఆమధ్య తన మనసులో మాట చెప్పుకొచ్చింది.

# అజిత్ 'పట్టుదల'.. తెలుగు ఓపెనింగ్స్ సంగతేంటి??



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ కాంపౌండ్ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ పట్టుదల (తమిళ టైటిల్- విదామయూర్చి). కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ కాంపౌండ్ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ పట్టుదల (తమిళ టైటిల్- విదామయూర్చి). సీనియర్ బ్యూటీ త్రిష హీరోయిన్ గా నటించగా మాగిజ్ తిరుమేని దర్శకత్వం వహించారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో సుభాస్కరన్ నిర్మించారు. ఇప్పటికే మూవీ షూటింగ్ కంప్లీట్ అవ్వగా.. పొంగల్ కు విడుదల కావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందిన పట్టుదల మూవీ.. ఫిబ్రవరి 6వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం మేకర్స్ అనౌన్స్ చేశారు. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తున్నారు. వరుస పోస్టర్లను రిలీజ్ చేస్తున్నారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



ఆయేషాఖాన్ హాట్ ఇన్ బ్లాక్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com